సన్మార్గం ఎప్పుడూ సత్ఫలితాన్నే ఇస్తుంది.

# ఇంటర్వ్యూ

నా పర్సులోని అడ్రసు కాగితం తీసి వీధిపేరు సరిచూసుకున్నాను. అలంకరణను బట్టి ఆ వీధిలోని పెళ్ళివారిల్లు ఏదో తెలుస్తూనే ఉంది. పల్లెటూరు సొగసులు, పట్నం పోకడలు కలగలిసి పాతకొత్త మేలుకలయికలా ఉన్న ఆ వూరు లాగానే ఆ ఇల్లూ ఉంది.

నేను ఇంట్లోకి అడుగు పెట్టగానే, అక్కడున్న నలుగురైదుగురు నన్ను చూసి 'హైద్రాబాద్ నుండి విజయ్ వచ్చాడు'... 'గోపాలం చిన్న కొడుకొచ్చాడు...' రాజేశ్వరి వాళ్లబ్బాయి వచ్చాడు...' అంటూ పక్కవాళ్ళతో చెబుతూ ఆదరంగా ఆహ్వానించారు. ముందుతరం వాళ్ళ పలకరింపుల్లో మనసుని తాకే ఆప్యాయత ఉంటుందనిపించింది.

నిజానికి ఈ పెళ్ళికి రావాలని అనుకోలేదు. అమ్మ పట్టుదల మీద వచ్చాను. 'అంత దూరపు బంధువుల పెళ్ళికి వెళ్ళకపోతేనేం...? మనం రాలేదని వాళ్ళేం అనుకోరుగా' అని అమ్మతో అంటే, 'అది నిజమే కావచ్చుగానీ, వెళ్తే మాత్రం వచ్చారని సంతోషిస్తారు. అలాంటప్పుడు ఎందుకు వెళ్ళకుండా ఉండాలి? కలుస్తూ ఉంటే దూరపు బంధువులైనా దగ్గరవుతారు. కలవకపోతుంటే ఎంత దగ్గర వాళ్ళయినా దూరమైపోతారు. అంతా రాకపోకల్లోనే ఉంది. ఇక్కడలా కాదు. మనవైపు వూళ్ళల్లో పెళ్ళిళ్ళు ఎంత సరదా సరదాగా, సందడిగా ఉంటాయో వెళ్ళి చూడు. నీకే తెలుస్తుంది' అని వాదించింది అమ్మ.

ఆపైన నాకూ కాదనలేని పరిస్థితి వచ్చి పడింది. నేను పనిచేస్తున్న పత్రిక తరఫున ఒక ప్రముఖ రాజకీయనాయకుడి ఇంటర్వ్యూ తీసుకోవాల్సివుంది. ఆయన సొంతవూరు ఇదే. ఆయన కొంచెం ఖాళీగా ఇక్కడ రెండురోజులుంటారు. అక్కడికి ఆయన ఇంటర్వ్యూ కోసం వెళ్తున్నావు కాబట్టి పెళ్ళికీ వెళ్ళాల్సిందేనని అమ్మ నన్ను ఒప్పించింది.

ఇంతలో భ్రమరాంబ పెద్దమ్మ ఎదురొచ్చి నవ్వు మొహంతో పలకరించింది. "నీ పనేదో నీదిగానీ నలుగురితో అంతగా కలవవని మీ అమ్మ అంటుంది. ఇలాంటి శుభకార్యాల్లో అయినా పదిమందినీ కలిస్తే బంధుత్వాలు బలపడతాయి. కొత్త పరిచయాలూ కలుగుతాయి. మనసుకీ ఉల్లాసం, ఉత్సాహం... తెలిసిందా?" అంటూ నన్ను వెంటబెట్టుకుని ఇంటికి ఓ పక్కగా వేసిన షామియానా దగ్గరకు తీసుకెళ్ళింది.

అక్కడ టిఫిన్ చేస్తున్న నా వయసువాళ్ళ పక్కన కూర్చోబెట్టి నన్ను పరిచయం చేసి నాకూ వేడి వేడి గారెలు, ఉప్మా వడ్డించి మళ్ళీ వస్తానంటూ వెళ్ళింది. టిఫిన్ పూర్తయ్యాక చేయి కడుక్కుని వెనుకవైపు నుండి లోపలకు వచ్చాను. పెద్ద గ్యాస్ స్టవ్ దగ్గర వంట చేస్తున్న వాళ్ళకి దూరంలో స్టూలు మీద కూర్చున్నావిడ సరుకులు అందిస్తోంది. అప్పుడే అటుగా వచ్చిన ఒక పెద్దాయన "పెద్దమ్మా... నువ్విక్కడ కూర్చున్నావా... శేరు వండాల్సినచోట సోలెడే సరిపోతాయంటావు. ఈ పూట మళ్ళీ వంట చేయాల్సి వస్తుంది చూడు..." నవ్వుతూ అన్నాడు. ఆవిడ ఒక క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే "మామయ్యా... నువ్వు మొదటి బంతిలో కూర్చోకుండా ఉంటే చాలు... వండాల్సిన అవసరం రాదు. నే చెబుతున్నాగా..." అంటూ నవ్వింది. అందరూ కూడా వాళ్ళిద్దరితోపాటు పెద్దగా నవ్వారు. పెళ్ళి వారింట్లో ఇలాంటి హాస్యాలు, పరిహాసాలు మామూలే. అందుకే కాబోలు ఏమాత్రం వీలున్నా అమ్మ శుభకార్యాలకు హాజరు కాకుండా ఉండదు.

బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న నా స్నేహితుడికి ఈమధ్యనే ఈ ఊరికి ట్రాన్స్ఫరయింది. వాడిని కలిసివస్తే బావుంటుందని ఫోన్ చేశాను. పెద్దమ్మకి చెబితే భోజనం వేళకు రావాలని చెప్పింది. భోజనానికి ఉండాల్సిందేనని మరీ మరీ చెప్పాడని, అటు నుండి వెళ్ళి ఆఫీసు పనీ చూసుకుని సాయంకాలానికి వచ్చేస్తానని బయలుదేరాను. అనుకున్నట్లుగానే మధ్యాహ్నం మూడు గంటలకి వెళ్లి ఇంటర్వ్యూ తీసుకుని నాలుగింటికల్లా పెళ్ళింటికి చేరాను.

ఇంటి వాతావరణంలో ఏదో తేడా కొట్టొచ్చినట్లుగా కనిపించింది. నాకేం అర్థం కాలేదు. ఉదయం నేనొచ్చినప్పుడు... కొందరు ఒకటే హడావుడిగా తిరుగుతుంటే, ఇంకొందరు తీరుబడిగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ చిన్నచిన్న పనులు చేస్తున్నారు. అందరిలోనూ ఉత్సాహమే! ఇపుడేమో అందరూ ఏ పనీ లేనట్టుగా ఎక్కడివాళ్ళు అక్కడ చతికిలపడి నిర్లిప్తంగా ఉన్నారు. మెల్లగా మాట్లాడుకుంటున్నారు.

పెరట్లోకి వెళ్తే... వేపచెట్టు క్రింద ఓ మంచం మీద రాజ్యం పిన్ని ఒక్కతే కూర్చుని ఉంది. నేనూ వెళ్ళి పక్కనే కూర్చుని ఏమయిందని మెల్లిగా అడిగాను.

పిన్ని పెద్దగా నిట్టూర్చింది. స్వరం బాగా తగ్గించి అసలు విషయం చెప్పింది. పెళ్ళికూతురి తండ్రి బలరాం పెదనాన్నకి ఊళ్ళో ఒకవైపున ఎనిమిదెకరాలు, ఇంకోవైపున మరో పదెకరాలు ఉన్నాయి. కూతురి పెళ్ళి నిశ్చయం చేసుకునేటపుడు పెళ్ళికొడుకు వాళ్లకి దక్షిణం వేపున్న ఎనిమిదెకరాలూ కూతురి పేరున ముహూర్తం నాటికే రాసేస్తానని బలరాం పెదనాన్న చెప్పాడట. అయితే ఈ లోపుగా, దక్షిణ పొలం పక్కగా రోడ్డు పడుతోంది కాబట్టి వాటికి రేటు బాగా పెరుగుతుందనే మాట బాగా ప్రచారంలోకి వచ్చింది. దాంతో పెదనాన్న ఖరీదైన భూమి అంతా కూతురికే రాసివ్వటం ఎందుకని

ఆలోచనలో పడి నిదానంగా ఆలోచించి తర్వాత చూద్దాంలే అని వూరుకున్నాడు. విషయం ఏమిటో తేలాక వియ్యాలవారితో మాట్లాడదామని మిన్నకుండిపోయాడు. ఈ కారణంగానే ఇప్పుడు అపోహలు వచ్చాయి. బలరామయ్య కూతురికి ఇంత మంచి సంబంధం కుదిరిందే అని లోలోపల గుర్రుగా వున్న వాళ్ళెవరో విడిదికెళ్ళి వాళ్ళ చెవిలో ఈ మాటనే ఇంకొంచెం వక్రీకరించి ఊదారు. దాంతో వాళ్ళు చిర్రుబుర్రులాడుతున్నారనే విషయం ఇక్కడికి వచ్చింది. ఈ పెళ్ళి జరుగుతుందో, ఆగిపోతోందో తెలియక అందరూ దిగాలు పడి కూర్చున్నారు. ఇదీ సంగతి.

నేనూ ఆశ్చర్యంగా వింటూండిపోయాను.

"ఇదేంటి పిన్నీ ఇలాంటి చిక్కొచ్చిందీ...! ఎవరైనా వెళ్ళి నచ్చచెప్పొచ్చుగా...?" అడిగాను.

"అదీ అయింది..." అంటూ మళ్ళీ నిట్టూర్చింది.

"అంజిబాబునీ, జగ్గన్ననీ పంపించారు. ఎమ్.ఎల్.ఏ నని అంజిబాబుకి బెట్టెక్కువ. ఇక జగ్గన్న సంగతి సరేసరి... వాడి మాటలకి కత్తి అంచుకంటే పదునెక్కువ! కొట్టినట్టే మాట్లాడతారు. అలాంటివాళ్ళు ఎలా నచ్చజెప్పగలుగుతారు. ఏం చేయగలుగుతారు, చివరికి మరింత రెచ్చగొట్టి వచ్చారు! ఒకవేపున్న ఖరీదైన భూమి ఒకరికే కాకుండా ఇద్దరు పిల్లలకూ అక్కడిదీ ఇక్కడిదీ కలిపి సరిసమానంగా రాద్దామని అనుకున్నాం గానీ మీరనుకున్నట్టుగా మనసు మార్చుకుని దక్షిణ పొలం అంతా అబ్బాయికే ఇవ్వాలని అనుకోలేదని బలరామ్ చెప్పి పంపితే, వీళ్ళేమో వెళ్ళి 'ఈ పెళ్ళి మీకిష్టం లేకపోతే నిక్షేపంలా వెళ్ళిపోవచ్చు'నంటూ మాట్లాడి మరింత చెడగొట్టారు! పైగా ఇక్కడికొచ్చాక "ఈరోజుల్లో... పెళ్ళి ఆగిపోయినంత మాత్రాన పిల్ల జీవితం నాశనమైపోతుందేమోననే భయం అక్కర్లేదు. మనకి మర్యాద తెలియదన్న వాళ్ళతో సంబంధం ఎందుకూ, ఇంకొకటి చూసుకుందాం...' అంటున్నారు."

"అయితే బలరాం పెదనాన్న ఏమంటున్నాడు...?" అడిగాను.

"బలరాంకీ పంతం, పట్టుదల తక్కువేం కాదుగా, ఏం జరుగుతుందో చూద్దాంలే అని నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండిపోయాడు. అసలు వాళ్ళకే లేనప్పుడు మనకి మాత్రం ఎందుకూ అని చోద్యం చూస్తున్నట్టుగా అందరూ మిన్నకుండిపోలేరుగా, ఇపుడే భ్రమరాంబ అక్కయ్య నేను మాట్లాడి వస్తానంటూ విడిదింటికి వెళ్ళింది మరి. ఏం జరుగుతుందో చూడాలి..." అంది పిన్ని.

''పెద్దమ్మ వెళ్ళిందా... అయితే ఇంకేం, పని సానుకూలం చేసే వస్తుంది...'' ఉత్సాహంగా అన్నాను. ఈ విషయం విన్నప్పటి నుండి మనసులో ఓ మూల నాకూ బెంగగానే వుంది.

"మన బంధువర్గంలో భ్రమరాంబ అక్కయ్యంటే అందరికీ గౌరవం. తన మాటని వేదవాక్కులా వింటారు. కానీ అక్కయ్య గురించి వాళ్ళకేం తెలుసు... తన మాట వింటారనే నమ్మకం ఏమిటి? పెళ్ళి క్యాన్సిల్ అనే వరకు వెళ్ళారంటే వాళ్ళూ తక్కువేం కాదు. ఆ పైన మగపెళ్ళి వాళ్ళమనే బెట్టు ఇంకా చాలామందిలో ఉండనే ఉంటుంది!"

పిన్ని మాట్లాడుతూండగానే లోపలకు వస్తున్న పెద్దమ్మ కనిపించింది. పెద్దమ్మ చుట్టూ గుమిగూడిన వాళ్ళల్లో పిన్నీ, నేనూ కూడా చేరాం. అందరిలోనూ విషయమేమిటో తెలుసుకోవాలనే ఆతృతే!

"ఏం లేదర్రా... వడ్లగింజలో బియ్యపు గింజ... అంతే! 'మీ అమ్మాయికి మీరు ఇచ్చుకునే ఆస్తి విషయంలో మాకేం పేచీ లేదు. మాకూ ఓ మాట చెప్పాలనే మర్యాద పాటించలేదనే నొచ్చుకున్నాం' అన్నారు. అందరూ తీరుబడిగా సాగిలబడ్డారు గానీ లేవండిక... పనులు మొదలు పెట్టండి..." అంటూ పెద్దమ్మ నవ్వింది.

అందరి మనసులూ తేలికపడినట్టుగా మొహాలు విచ్చుకున్నాయి.

పెద్దమ్మ బలరామ్ పెదనాన్న వేపు చూసి "అబ్బాయ్... వాళ్ళనీ, వీళ్ళనీ పంపటమెందుకూ, నువ్వే వెళ్ళి ముందుగా చెప్పకపోవటం పొరపాటని సర్దిచెప్పు... వాళ్ళూ సమాధానపడతారు" అంది.

"వాళ్ళేదో చిర్రుబుర్రు లాడుతున్నారంటే నాకూ కొంచెం కోపం వచ్చి బెట్టు చేశానంతే. వాళ్ళు మర్యాదగా మాట్లాడుతుంటే... పొరపాటు అయిందని ఒప్పుకుని సర్దిచెప్పటానికి నాకేం నామర్దా లేదు! ఏదో పిల్లలిద్దరికీ సమం చేయాలనుకున్నానుగానీ, నా పేరునున్న దానిలో ఇంకో రెండెకాలు ఇమ్మన్నా ఆనందంగా ఇస్తాను. మనమ్మాయికేగా!" చిరునవ్వుతో పెద్దమ్మకి సమాధానం చెప్పి భుజం మీద కండువా సరిచేసుకుంటూ పక్కనున్న ఆయనతో "పద బావా, విడిదింటికి వెళ్ళొద్దాం..." అన్నాడు.

అందరూ గలగల నవ్వులూ, కబుర్లతో హడావుడి పడటం మొదలైంది.

నేను పెద్దమ్మని "ఖాళీయేనా... నాక్కొంచెం సమయమిస్తావా పెద్దమ్మా... నీతో మాట్లాడాలి" అడిగాను.

"భలేవాడివిరా... ఖాళీ కాక నాకేం పని ఉందీ! పద... కాసేపు కబుర్లు చెప్పుకుందా... మళ్ళీ ఎన్నాళ్ళకు కనిపిస్తావో..." అంటూ నవ్వింది.

ఇద్దరం ఇందాకటి చోటుకు చేరాం.

"ఏంటో చెప్పు. నీ ఆఫీసు పని పూర్తయిందా?" అంది పెద్దమ్మ.

"ఆ ఇంటర్వ్యూ అయింది. ఇప్పుడు నీది తీసుకుందామని..." సరదాగా అన్నాను.

"చాల్లే వేళాకోళం! నేనేమైనా పేరు ప్రఖ్యాతులున్నదానినా...?" అంది నవ్వుతూ.

"కాకపోవడమేమిటి... మన బంధువుల్లో నీకెంత మంచి పేరుందో నీకు తెలియదులే" అంటూ నేనూ నవ్వి, "అందరిచేతా మంచివాళ్ళనిపించుకోవటం చాలా కష్టమని అంటూంటారు కదా... మరి... నీకెలా సాధ్యమయిందో చెప్పు..." అన్నాను.

"ఏం ఉందీ... ప్రతివాళ్ళలోనూ మనకి నచ్చే గుణాలూ, నచ్చని లక్షణాలూ ఎక్కువ తక్కువలుగా ఉంటాయి. నచ్చని గుణాల్ని విస్మరించటం, నచ్చే గుణాల్ని మెచ్చుకుకని స్నేహంగా ఉండటమే. అంతేగా! అదేదో నీకు తెలియని విషయమన్నట్టుగా అడుగుతున్నావే!" అంది నవ్వుతూ.

"నేను అందరిలా పిల్లల్ని పెంచుతూ మామూలు జీవితం గడిపిన దానినే. ఊరికేమైనా ఉపకారం చేశానా... నా ఇంటర్వ్యూ తీసుకోవటానికి, నువ్వేదో తమాషా చేస్తున్నావుగానీ...!" మళ్ళీ అంది.

"మన చుట్టూవున్న సామాన్యుల్లో కూడా విశిష్ట వ్యక్తిత్వం గలవాళ్ళూ ఉంటారు. వాళ్ళ అనుభవాలు, ఆలోచనల గురించి తెలుసుకోవటం ఎంతో కొంతమందికి స్ఫూర్తిదాయకంగానే ఉంటుంది! అవునా పెద్దమ్మా..."అన్నాను.

"సరేలేరా... నీ సరదా నీది... కానియ్..." అని ఎవరినో పిలిచి కాఫీలు తెమ్మని పెద్దమ్మ పురమాయించింది.

రెండు నిమిషాలు నేను ఆలోచనలో పడ్డాను. ఇంతలో కాఫీలు వచ్చాయి. తాగుతూ కబుర్లు మొదలు పెట్టా.

"పెద్దమ్మా... ముందుగా నీ జీవితం గురించి ఒక మాటలో చెప్పు..."

"ఏం ఉందీ... సంతృప్తిగా, సంతోషంగా సాగిపోతున్న జీవితమే!"

"దానికి కారణం... ఎవరు, ఏమిటి, అనుకుంటున్నావ్...?"

"ఇంట్లో వాళ్ళు అంటే... ఆయన, పిల్లలు నా ఇష్టాల్ని కాదనకపోవటం ఒక కారణమైతే, స్థోమత మించిన కోరికలు నాకు లేకపోవటం... ఇంకొక కారణం!" అంటూ నవ్వింది.

నేనూ నవ్వి "నీ కోరికల్ని కాదన్న సందర్భాలే లేవంటావా...?" అనడిగాను.

"చెప్పానుగా... కాదనే పరిస్థితి రాకుండా నేనూ జాగ్రత్త తీసుకున్నాను!"

"అంటే...?"

"అంటే... ఏముందీ... ఒకసారి వంటింట్లోకి కావాల్సిన ఖరీదైన వస్తువే ఆయన్ను అడిగాను. సరే అన్నారు గానీ మనసులో ఏదో మథనపడుతున్నారని పసిగట్టాను. వాళ్ళ వూరు వాళ్లెవరికో అవసరానికి డబ్బు సర్దుతానని మాట ఇచ్చారు. ఈ విషయం తెలిశాక, నేను కొనాలనుకున్నది అందరూ దండగంటున్నారు కాబట్టి ఉద్దేశం మార్చుకున్నానని చెప్పేశాను. దాంతో ఆయన చాలా రిలీఫ్‌గా ఫీలవటం చూసి... రాజీ పడటంలో ఆనందం అందని నాకూ అర్థమైంది! సంగతేమిటో నీకర్థం అయిందా...?" నవ్వుతూ అడిగింది.

అయిందన్నట్లుగా చిరునవ్వుతో తలూపాను.

"నీ జీవితంలోని మరపురాని సంఘటన... ఏదైనా ఒకటి చెప్పు..." అడిగాను.

ఒకే ఒక్క క్షణం ఆలోచించి పెద్దమ్మ వెంటనే మొదలుపెట్టేసింది.

"ఇది పదిహేనేళ్ళ క్రిందటి సంగతి. గోదావరి పుష్కరాలకని రాజమండ్రి బంధువుల ఇంటికి వెళ్ళాను. మొదటిరోజు బంధువులతో వెళ్లి గోదావరి స్నానం చేసొచ్చాను. మర్నాడు కొంచెం పొద్దెక్కాక నేనొక్కదాన్నే వెళ్ళాను. నీటిలోకి దిగుతూ అటుపక్కకి చూసి ఉలిక్కిపడ్డాను. కొంచెం దూరంలో... ఒక అబ్బాయి... కాళ్ళకి నేల అందటం లేదో ఏమో. మునుగుతూ తేలుతూ చేతులు పైకి చూపిస్తున్నాడు. అందరూ ఎవరి గొడవలో వాళ్ళున్నారు.

నాకు విషయం అర్థమై ఆలస్యం చేయకుండా పై మెట్టుమీద నుండి “బాబూ... ఎవరైనా కాపాడండి... బిడ్డ మునిగిపోతున్నాడు...” అంటూ పెద్దపెద్దగా కేకలు పెడుతూ అటువేపు చూపిస్తూ ఏడ్చేశాను.

ఎవరో ఇద్దరు నాలుగు అంగల్లో ఈదుకుంటూ వెళ్ళి ఆ పిల్లాడి రెండు చేతులు పట్టుకుని ఒడ్డుకు తీసుకువచ్చి నా పక్కన కూర్చోబెట్టారు. ఆ అబ్బాయికి పది పన్నెండేళ్ళుంటాయేమో, నిలువు గుడ్లేసుకుని చూస్తూ భయంతో వణికిపోతున్నాడు. తలని ఒళ్లోకి తీసుకుని భయం లేదమ్మా' అంటూ ధైర్యం చెప్పాను. పిల్లాడు బాగానే ఉన్నాడని నిర్ధారించుకున్నాక గుమిగూడిన జనం అంతా వెళ్ళిపోయారు.

“గొప్ప అదృష్టం... బాబూ బతికి బయటపడ్డాడు... కాస్త ఆలస్యం అయివుంటే ఏమయ్యేదో గానీ...” అన్నారు వాళ్ళిద్దరూ.

మా ఇంట్లో ఎప్పటివో చాలా చిన్న చిన్న బంగారు నాణేలు ఉన్నాయి. వాటిని సువర్ణ దానంగా ఇద్దామని చెంగున ముడేసుకుని వచ్చాను. ఆ ముడివిప్పి వాటిని వాళ్ళ చేతుల్లో పెట్టాను. వాళ్ళు వాటిని ఆనందంగా కళ్ళకద్దుకుని నాకు దణ్ణాలు పెట్టి వెళ్ళిపోతుంటే... అప్పుడు ఆ అబ్బాయి తల నిమురుతూ, 'మీ అమ్మా నాన్నా రాలేదా, నువ్వొక్కడివే వచ్చావా. మీ ఇల్లెక్కడ...?” నిదానంగా అడిగాను. రెండడుగులు వేసిన వాళ్ళిద్దరూ తిరిగి “ఏంటమ్మా... ఈ బాబు మీ అబ్బాయి కాదా... బాబు... బాబు.. అంటూ అంతలా కన్నీళ్ళు పెట్టారు...?” అని విచిత్రంగా చూశారు.

“ఈ అబ్బాయీ ఓ తల్లి కన్నబిడ్డేగా, నేనూ పిల్లల తల్లినే! మునిగిపోతుంటే చూసి తట్టుకోలేకపోయాను. కష్టం ఎవరిదైనా ఒకటేగా!” అన్నాను.

వాళ్ళు చాలా ఆశ్చర్యంగా చూస్తూనే మళ్ళీ దణ్ణాలు పెట్టి వెళ్ళిపోయారు.

ఆ అబ్బాయి రెండు నిమిషాలకే తేరుకుని వివరాలు చెప్పాడు. వాళ్ళిల్లు అక్కడికి దగ్గరే. ఒక్కడే వచ్చాడు. నేను వెంటబెట్టుకుని వెళ్ళి తల్లిదండ్రులకు అప్పగించాను. విషయం తెలిసి ముందు బిత్తరపోయారు. ఆ తరువాత ఆనందంతో కన్నీళ్ళుపెట్టుకున్నారు. పదే పదే కృతజ్ఞతలు చెప్పారు. 'దేవత'లా మాకు పుత్రభిక్ష పెట్టావమ్మా... అన్నారు. ఆరోజు... ఆ తల్లిదండ్రుల ఆనందం... నాకు ఎప్పటికీ మరపురాదు!” అంటూ ముగించి “మరీ వివరంగా చెప్పినట్టున్నాను కదూ?” అంది.

నేనేం మాట్లాడలేనివాడిలా పెద్దమ్మ వేపు ఒక నిముషం అపురూపంగా చూసి, “చేదు సంఘటన ఏదైనా ఉంటే... అదీ చెప్పు...” మెల్లగా అడిగాను.

పెద్దమ్మ నిట్టూర్చింది. “నా పెళ్ళయిన నాలుగైదు సంవత్సరాలకి అమ్మా నాన్నా ఇద్దరూ చనిపోయారు. ఆ తర్వాత రెండేళ్ళకే ఆయన ఉద్యోగరీత్యా మేం దూర ప్రాంతంలో ఉన్నప్పుడు మాకో విషయం తెలిసింది. మా నాన్న వాటాగా వచ్చిన డబ్బును మా బాబాయ్ మా ముగ్గురు అక్కలకీ పంచి ఇచ్చాడని ఎవరో చెబితే, విషయం ఏమిటో తెలుసుకుందామని అంత దూరం నుండి నేను మా వూరు వెళ్ళాను. నేను విన్నది నిజమేనని తెలిసింది. అక్కలు మా వూరు చుట్టుపక్కలే ఉంటారు. తరచు కనిపించేవాళ్ళూ, రాకపోకలు సాగించేవాళ్ళూ గనుక వాళ్ళకే ఇచ్చేస్తే సరిపోతుందని అనుకున్నాడా...

అందులో ఆయనకేదైనా లాభం వుండి నన్ను మినహాయించాడా... బాబాయ్ అలా ఎందుకు చేశాడో అర్థం కాలేదు!

నేనెందుకు వచ్చానో తెలిసి "పెద్ద ఆశతోనే వచ్చినట్టున్నావ్... మీ ఆయన పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడుగా, సంపాదన సరిపోవటం లేదా?" అని బాబాయ్ నన్ను అడిగాడు. నాకు చాలా అవమానం అనిపించింది. మౌనంగా ఉండలేకపోయాను.

"ఆయన సంపాదన సరిపోవటం లేదనో, ఏదో సమస్యలున్నాయనో ఎవర్నీ సహాయం అడగటానికి నేను రాలేదు. కూతురుగా నాన్న ఆస్తిలో నాకూ వాటా ఉందనుకున్నాను. అంతా కావాలని అనుకోవటంలో అత్యాశ ఉంటుంది కానీ నాకూ కావాలనటంలో న్యాయమైన ఆశ మాత్రమే ఉంది! ఆశ ఎవరికైనా ఉండాల్సిందే... తప్పేంలేదు!' కొంచెం పరుషంగానే సమాధానం చెప్పాను.

"మీలో మీరు తేల్చుకోవచ్చుగా, నన్నడగటం దేనికీ?" అంటూ బాబాయ్ రుసరుసలాడాడు. సమన్యాయం చేయలేనప్పుడు పంచి ఇచ్చే బాధ్యత తీసుకోవటం ఎందుకూ? మనసులోనే అనుకుని ఏం మాట్లాడకుండా వచ్చేశాను.

'నా కళ్ళముందు పుట్టి పెరిగిన పిల్ల ఎంత పొగరుగా మాట్లాడిందో' అని బాబాయ్ అందరితో అంటున్న మాట నాకూ తెలిసింది. నేను మాత్రం అవమానాన్ని ప్రతిఘటించటమేనని అనుకున్నాను. ఏమయిందో ఏమోగానీ, ఆస్తిని బాబాయ్ నాలుగు వాటాలుగా మార్చి ఆరు నెలల తర్వాత నాది నాకు పంపించాడు. న్యాయమైన నా హక్కును సాధించగలిగానని సంతృప్తి చెందాను. మన ప్రాంతంలోనే ఆయన స్నేహితుడున్నచోట ఒక ఇల్లు అమ్మకానికి ఉందని చెబితే, ఆ డబ్బుతో అది మేం కొనుక్కున్నాం..." అని ముగించింది.

"అయితే పెద్దమ్మా... నీ జీవితం ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగినట్టేనా...?" అడిగాను.

"ఆటుపోట్లు ఎవరికైనా తప్పవు. సమస్యల సుడిగుండంలో పడి ఓ మూడేళ్ళు గిలగిల కొట్టుకున్నాను తెలుసా! ఎలాగో ఒంటరిగా ఏటికి ఎదురీది బయటపడ్డాను. అదీ వివరంగా చెబుతానుండు..." అంటూ మొదలు పెట్టింది.

"ఒకరోజు ఆయన వున్నట్టుండి విరుచుకు పడిపోయారు. పెరాలసిస్ అన్నారు. కాలూ, చెయ్యి పడిపోయాయి. నాకు గుండె ఆగినంత పనయింది! వంటిమీదున్న బంగారం కాస్తా వైద్యానికి ఖర్చయిపోయింది. రోజూ ఎక్సర్‌సైజులు చేయించడం తప్ప చేయగలిగిందేంలేదని డాక్టర్లు తేల్చేశారు. ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం కదా, భరోసా ఏం ఉంటుందీ, అదీ పోయింది. ఇక ఇక్కడి వూళ్ళోని సొంత ఇంటికి చేరాం.

సంపాదన, ఖర్చూ సరిసమానంగా జరిగిపోయిన రోజుల్లో పొదుపు విలువ తెలియలేదు. ఉద్యోగం పోయాక తెలిసివచ్చింది. పిల్లల చదువులు కొనసాగించాలి... ఆయనకి వైద్యం జరగాలి. రోజులు గడపాలి. ఎలా అని మధనపడుతూంటే ఒక వార్త తెలిసింది. మా వీధి చివరున్న కుటుంబం అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకుందని! ఒక్క క్షణం అదేపని మేం చేస్తే అనే పిచ్చి ఆలోచన వచ్చింది. ఆయన కూడా అదే మాట అనేసరికి నేను నిలువెల్లా కదిలిపోయాను! తట్టుకోలేక ఏడ్చేశాను.

మనసులోని భారం తగ్గింది. ఆయన చేతిని పట్టుకుని 'అలాంటి పరిస్థితిని ఎప్పటికీ రానీయను' అంటూ ధైర్యం చెప్పాను! నమ్మకాన్నీ, ఆశనూ పెంచుకున్నాను.

పక్కింటావిడ సలహాతో నాకో దారి దొరికింది. వాళ్ళ బంధువుల బట్టలషాపు నుండి కొంచెం స్టాకు తెచ్చి ముందు గదిలో సర్దాను. అమ్మకం మొదలుపెట్టాను. ఇరుగు పొరుగు వాళ్ళందరికీ చెప్పుకొచ్చాను. నాలుగు రోజులకు ఒకసారి మూడు మైళ్ళు నడిచివెళ్ళి బట్టల్ని బండిలో తెచ్చేదాన్ని. రోజూ చీకట్నే లేచి ఇంటి పనులు చక్కబెట్టి పిల్లల్ని బాక్సులతో స్కూలుకు పంపించటం, ఆయనకు మందులు వేసి ఎక్సర్‌సైజులు చేయించి, మిగిలిన ఇంటి పనుల్ని చూసుకుంటూనే బట్టల అమ్మకాల్ని కొనసాగించటం... సాయంకాలాలు పిల్లల్ని చదివించటం... క్షణం తీరిక లేకుండా ఉండేదాన్ని. అయితే నేను చేసిన ముఖ్యమైన పని ఏమిటంటే... అందరిలో ఆశల దీపం ఆరిపోకుండా కాపాడటమే! అవును... నేను చేసిన ఆ వైద్యమే మమ్మల్ని సజీవులుగా నడిపించింది. ఏమీ చేయలేకపోతున్నానని బాధపడుతున్న ఆయనకు తొందరలోనే మునుపటిలా ఉద్యోగం చేసే రోజు వస్తుందని డాక్టర్లు చెప్పారంటూ నమ్మకం కలిగించేదాన్ని! మంచి బట్టలూ, సౌకర్యాలూ లేవని పిల్లలు అసంతృప్తి పడే సందర్భాల్లో.. వాళ్ళకి భవిష్యత్తును రంగుల చిత్రపటంగా చూపించి వూరించి వూరడించేదాన్ని! 'ఇప్పుడు శ్రద్ధగా చదువుకుంటే... రేపు మీదవుతుంది... మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. కావాల్సినవన్నీ కొనుక్కోవచ్చు. ఇంకా కొందరికి సహాయం చేయగలిగే స్థితికీ ఎదుగుతారు' అని చెబుతుండేదాన్ని. ఈ సమస్యలన్నీ కొన్నాళ్ళేగా, మంచి రోజులు వస్తాయనే ఆశతో వాళ్ళూ బాగా చదువుకునేవాళ్ళు. అలా ఆశల దీపం సాయంతో సమస్యల చీకటి దారిలో సునాయాసంగా నడిచేశాను...!"

ఆ రోజుల గురించి చెబుతున్నప్పుడు... సమిష్టిగా, శ్రమతో సమస్యలను ఎదుర్కోగలిగామన్న భావనతో కాబోలు పెద్దమ్మ కళ్ళు మిలమిలలాడాయి!

"పెద్దమ్మా... ఇంకొక ప్రశ్న... పిల్లల విషయంగా బాధపడిన, బాగా సంతోషించిన సందర్భాలు ఏమిటి?"

"పిల్లల అల్లరితో, గొడవలతో వచ్చే చిన్న చిన్న చికాకులే తప్ప బాధలేం లేవు. ఆ విధంగా మేం అదృష్టవంతులమే! అయితే బాగా ఆనందించిన సందర్భం గురించి వివరంగానే చెబుతాను. మా పెద్దబ్బాయి ఇంటర్ ఫస్టియర్‌లో ఉన్నప్పుడు కాబోలు... కాలేజీ నుండి ఇంటికి నడిచి వస్తుంటే, దూరంగా... స్కూటరు మీద వెళ్తున్న ఒకతను చేతిలోని చిన్న బ్యాగును రోడ్డు పక్కనున్న తుప్పల్లోకి విసిరేయటం చూశాడు. దగ్గరికెళ్ళి ఆ బ్యాగ్ తీసి చూస్తే, దాన్నిండా నోట్ల కట్టలు ఉన్నాయి! నిర్ఘాంతపోయి చూస్తుండగానే, వెనుక నుండి వచ్చిన ఇద్దరు స్నేహితులు ఆశ్చర్యపోయారు. ఎవరో తరుముకు వస్తున్నారనే భయంతో మళ్ళీ వచ్చి తీసుకుందామని అక్కడ పడేసి పారిపోయి ఉంటారని వాళ్ళు ఊహించారు. "మీ ఇంట్లో ఇవ్వరా..." ఒక ఫ్రెండు సలహా ఇస్తే మరొకడు 'ఎక్కడైనా భద్రంగా దాచి, అప్పుడప్పుడూ మనమే ఖర్చు పెట్టుకుందాం'... అని బ్రహ్మాండమైన ప్లాన్ వేశాడు.

మావాడు మాత్రం వాళ్ళ మాటల్ని పట్టించుకోకుండా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి ఆ బ్యాగును అప్పజెప్పేశాడు. ఆ బ్యాగ్ పోగొట్టుకున్నతను కంప్లయింట్ ఇవ్వడానికి వచ్చి ఇంకా అక్కడే ఉన్నాడు. అతను ఆనందంతో ఉక్కిరి బిక్కిరైపోయి మావాడిని పట్టుకుని పొగడ్తలతో ముంచెత్తేశాడట!

ఆ ఎస్.ఐ. కూడా మా వాడిని తన జీపులో తీసుకువచ్చి మా ఇంట్లో దింపి, రెండు నిముషాలు మెచ్చుకుంటూ మాట్లాడి వెళ్ళిపోయాడు. నేను సరదాగా వాడిని 'మీ ఫ్రెండ్స్ ఎవరిమాటా వినాలని ఎందుకు అనిపించలేదురా?' అనడిగితే ఏం చెప్పాడో తెలుసా? 'ఇదే సందర్భం కాకపోయినా, ఇలాంటి విషయాల్లో నాన్నా, నువ్వూ ఎలా ప్రవర్తిస్తారో నాకు తెలుసుకదమ్మా! నేను మాత్రం వేరేగా ఎందుకు చేస్తాను?" అన్నాడు. నాకు ఆనందంతో కన్నీళ్ళు వచ్చేశాయి.

అవును... కొందరికి మినహాయింపు ఉంటుందేమోగానీ చాలామంది పిల్లలు మాత్రం తల్లిదండ్రుల దారిని బాగానే గమనిస్తారు. అనుసరిస్తారు! ఈ విషయం నాకప్పుడు అర్థమైంది.

నాలుగు నెలల తర్వాత కాబోలు, ఆ ఎస్.ఐ. మళ్ళీ మా ఇంటిని వెతుక్కుంటూ వచ్చి మాకు చెప్పిన సంగతికి విస్తుపోయాం!"

"ఏం చెప్పాడు పెద్దమ్మా...?" మధ్యలో అడ్డం వెళ్ళి చాలా ఆతృతగా అడిగాను.

పెద్దమ్మ పెద్దగా నవ్వేసింది. "ఆ ఎస్.ఐ.కి బాగా తెలిసిన పెద్ద వ్యాపారస్తుడికి డబ్బు లావాదేవీలతో కూడిన ఉద్యోగాన్ని నిజాయితీగా చేసే వ్యక్తి కావాలట! ఆ ఉద్యోగం మా ఆయనకి ఇవ్వటానికి మమ్మల్ని వెతుక్కుంటూ ఆ ఎస్.ఐ. వచ్చారని తెలిసి ఆనందంతో తబ్బిబ్బయిపోయాం! ఆరోగ్యం కుదుటపడిన దగ్గర్నుండీ ఉద్యోగం కోసం చాలా ప్రయత్నాలే చేస్తున్నా ఏదీ ఫలించలేదు అనుకోని విదంగా మావాడి నిజాయితీకి కానుకగా అన్నట్లుగా మంచి జీతంతో ఆయనకు ఉద్యోగం దొరకటం మాకు మంచి రోజులు వచ్చాయని ఆనందించాను. అప్పటి నుండీ జీవితం సాఫీగా జరిగిపోయినట్టే! పిల్లలిద్దరూ మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వాళ్ళకి చేతనయినంతలో చదువుకునే పిల్లలకి సహాయాలూ చేయగలుగుతున్నారు." ఆనందంగా, హాయిగా నవ్వింది.

"బావుంది పెద్దమ్మా. ఇంటర్వ్యూ అయిపోయింది. దానితో సంబంధం లేకుండా ఒక సందేహం మగ పెళ్ళి వాళ్ళు ముందుగా తమ దగ్గరికి వచ్చిన పెద్దలతో ఆవేశంగా మాట్లాడారు. మరి నీతో ఎందుకంత సౌమ్యంగా వ్యవహరించారు? ఏం మంత్రం ఏశావు?"

పెద్దమ్మ మళ్ళీ నవ్వింది.

"పెళ్ళి కొడుకు తండ్రి పక్కన కూర్చున్నాయన నేనేదో చెప్పబోతుంటే... "పెళ్ళి చూడటానికి వచ్చిన బంధువులు మీరు. ఈ విషయాల్లో ఎందుకు కలుగజేసుకుంటారు?" అని కొంచెం విసుక్కున్నాడు.

'ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే, నాకెందుకులే అనుకోలేకపోవటం నా అలవాటు బాబూ. ఎప్పుడో ఓసారి... ఈ అలవాటు వల్లే గోదావరిలో మునిగిపోతున్న పిల్లాడిని చూసి... నా బిడ్డేనన్నట్టుగా గగ్గోలు పెట్టాను... ఆ పిల్లాడి తల్లిదండ్రులు చాలా సంతోషించారే తప్ప చిరాకు పడలేదు" అని నిదానంగానే చెప్పాను.

పెళ్ళికొడుకు తల్లిదండ్రులిద్దరూ తెల్లమొహాలేసి... తర్వాత నా చేతులు పట్టుకుని, 'అమ్మా, మీరా... గుర్తు పట్టలేకపోయాం... క్షమించండి...' అన్నారు. పెళ్ళికొడుకు కుడిచేయి మణికట్టు దగ్గరున్న సెనగబద్దంత పుట్టుమచ్చని చూసి నేను బాగానే గుర్తుపట్టాను మరి!"

"అదా సంగతీ!" అని ఆశ్చర్యపోయాను. నేను ఆనందంగా నవ్వాను. పెద్దమ్మ ఇంటర్వ్యూ నాలో ఉల్లాసాన్ని, ఉత్తేజాన్నీ నింపింది.

నేను తీసుకున్న రాజకీయ నాయకుడి ఇంటర్వ్యూ వెంటనే ప్రచురితమవుతుంది. అది ఎంతమందికి ఎంతవరకూ ఉపయోగపడుతుందో తెలియదు కానీ, పెద్దమ్మ ఇంటర్వ్యూ సారాంశం మాత్రం కొందరికైనా మార్గదర్శకంగా ఉంటుందనేది నా అభిప్రాయం. అయితే అది వ్యాసంలాగానో, కథగానో ప్రచురింపబడే అవకాశం వస్తుందో... రాదో... వేచి చూడాల్సిందే...!

* * *

**'నవ్య వీక్లీ' 17-9-2014**